

శివం.. కేశవం..

జిల్లాలో పలుచోట్ల ఒకే ప్రాంగణంలో శివకేశవుల ఆలయాలు ఉన్నాయి. వైష్ణవ భక్తులు కూడా శివయ్యను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.

- 8లో



హత్యాయత్నం కేసుల్లో 10 మంది అరెస్ట్

హత్యాయత్నాలకు సంబంధించిన రెండు కేసుల్లో పది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.రిమాండు నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 69 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 24వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి రావాలని తెలిపారు.

నేడు వైవీయూ నూతన వీసీ బాధ్యతల స్వీకరణ



ఫణితి ప్రకాష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు సోమవారం ఉదయం 10 గంటలకు వీసీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ గా ఉన్న ఫణితి ప్రకాష్ బాబును వైవీయూ వీసీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఈ నెల 18వ తేదీన జి ఓ ఎం ఎస్ నెంబర్ 6 ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఏర్పాట్లు పూర్తి చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్‌లు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బందితో విడివిడిగా సమావేశం కానున్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కృష్ణయ్య సూచించారు. ఆదివారం రాయచోటిలో పరీక్ష కేంద్రాల్లో నియమించిన చీఫ్ సూపరిటెండెంట్స్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, కస్టోడియన్స్‌కు ఓరియంటేషన్, ట్రెనింగ్ సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షలు 49 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ పరీక్షల్లో మొదటి సంవత్సరం 14855 మంది, ద్వితీయ సంవత్సరం 13747 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాష్, అమరేంద్ర కుమార్, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు



గంగమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

లక్కిరెడ్డిపల్లి: శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ జాతర మార్చి 1, 2 తేదీల్లో జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాకార మండపంతోపాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు జాతర ఏర్పాట్లను సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం కలిగేలా క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అమ్మవారికి చాందినీ బండ్లు కట్టేవారు పోలీసుల అనుమతులు తీసుకొని పరిమిత ఎత్తు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది భక్తులకు రూ. 300లు, రూ. 100లు, రూ.10 టికెట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, పూజారులు చెల్లు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-2 అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్..

- ప్రభుత్వం చివరి నిమిషం దాకా స్పష్టత ఇవ్వకపోవడమే కారణం
- గందరగోళం.. మానసిక వేదనకు గురైన వైనం
- కూటమి సర్కార్‌పై నిప్పులు చెరిగిన నిరుద్యోగులు



కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద గ్రూప్‌-2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్: ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 మెయిన్స్ పరీక్ష నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల నెలకొన్న గందరగోళం పట్ల అభ్యర్థులు మండిపడ్డారు. రోస్టర్‌లో తప్పులు ఉంటే సరిదిద్దేందుకు కావాల్సినంత సమయం ఉన్నా ఆ పనిచేయకుండా పరీక్షకు ఒకరోజు ముందు వరకు కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో తాము తీవ్ర ఆందోళనకు గురయ్యామని వాపోయారు. రోస్టర్‌లో తప్పులున్నాయంటూ దాదాపు సంవత్సర కాలంగా ప్రచారంలో ఉన్నప్పటికీ కేసు న్యాయస్థానం పరిధిలోకి వచ్చే వరకు కూటమి ప్రభుత్వం దాన్ని సరిదిద్దకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండుమార్లు మెయిన్స్ వాయిదా వేశారన్నారు. రేపు పరీక్ష ఉందనగా, చివరి నిమిషంలో వాయిదా వేయాలంటూ ఏపీపీఎస్సీకి ప్రభుత్వం లేఖ రాయడం వెనుక రాజకీయ కుట్రకోణం ఉన్నట్లు అనుమానించాల్సి వస్తోందన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి డ్రామాలాడారంటూ పలువురు ధ్వజమెత్తారు. కూటమి పెద్దలు వ్యవహరించిన తీరు వల్ల అసలు పరీక్షలు జరుగుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితుల్లో తమ విలువైన సమయం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసగించిన చంద్రబాబు గ్రూప్‌-2 మెయిన్స్ విషయంలో కూడా తమ జీవితాలతో ఆడుకున్నారంటూ నిప్పులు చెరిగారు. ఆదివారం కడప నగరంలోని 13 పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులను 'సాక్షి' పలుకరించగా ఇదే విషయాన్ని అభ్యర్థులు ముక్తకంఠంతో చెప్పారు.

ప్రశాంతంగా గ్రూప్‌- 2 మెయిన్స్ పరీక్షలు



దివ్యాంగుడి హాల్ టిక్కెట్ పరిశీలిస్తున్న పోలీసు



హాల్ టిక్కెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జరిగిన గ్రూప్‌-2 మెయిన్స్ పరీక్ష ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్‌-2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన మెయిన్స్ పరీక్షకు సంబంధించి.. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్‌లో 5,111 మంది అభ్యర్థులతో హాజరు 87.74 శాతంగా, మధ్యాహ్నం సెషన్‌లో 5,825 మందికి గాను 5,096 మంది పరీక్షకు హాజరై అభ్యర్థుల హాజరు 87.48 శాతంగా నమోదైందన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయన్నారు.



కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

చివరి వరకు గందరగోళమే



గ్రూప్‌-2 మెయిన్స్ పరీక్షల విషయంలో ప్రభుత్వ తీరు వల్ల మేము గందరగోళం ఎదుర్కోవాల్సి వచ్చింది. పరీక్షలు వాయిదా పడతాయేమోనని భావించాము. అయితే చివరి నిమిషంలో పరీక్ష జరుగుతుందని ప్రకటించారు. ఇంత గందరగోళం గతంలో ఎన్నడూ చూడలేదు. - నరేష్‌బాబు, రాజంపేట

దూర ప్రాంత అభ్యర్థుల అవస్థ



నేను రాజస్థాన్‌లో ఆర్మీలో పని చేస్తున్నాను. ప్రకటించిన తేదీలో పరీక్ష జరుగుతుందని ఒకసారి, వాయిదా పడుతుందని మరోసారి ప్రభుత్వం నుంచి సంకేతాలు వెలువడ్డాయి. దీంతో దూర ప్రాంత అభ్యర్థులు టెన్షన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. -సిద్దేంద్ర, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా

టెన్షన్ పడ్డాను



చాలా రోజులుగా గ్రూప్‌-2కు ప్రిపేర్ అయ్యాము. దీనిపై ఎన్నో ఆశలు నింపుకున్నాము. అయితే ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితులు అంతటా నెలకొన్నాయి. నేను కూడా చాలా టెన్షన్ ఫీలయ్యాను. -కె.నాగన్న, ప్రొద్దుటూరు

ప్రభుత్వ తీరు బాధాకరం



తాము అధికారంలోకి వస్తే ఏపీపీఎస్సీ, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా కేవలం గ్రూప్‌-2 పరీక్ష నిర్వహణలో గందరగోళానికి తావివ్వడం బాధాకరం. - గురు, ప్రొద్దుటూరు

కోర్టు కేసు ఏమవుతుందో?



రోస్టర్‌లో తప్పులు చోటుచేసుకున్నాయనే విషయంపై కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు తీర్పు వల్ల వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో తెలియడం లేదు. ఇప్పుడు పరీక్షలు రాసినా కోర్టు తీర్పుతో ఇవి ఏమౌతాయో అనే ఆందోళన అభ్యర్థుల్లో ఉంది. - శ్రీనివాస్, జమ్మలమడుగు

వీరభద్రుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు



ధ్వజారోహణ కార్యక్రమంలో భక్తుడి విన్యాసం

వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి(రాచరాయుడు) బ్రహ్మోత్సవాలు ఆదివారం వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారు జామున వేదపండితుడు ప్రణవానందగిరి (నర్నా వెంకట భాస్కర సిద్ధాంతి) తన శిష్యులతో యాగశాల, తర్వాత మహాగణపతి పూజ, గోపూజ నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామి, అమ్మవార్లకు కంకణధారణ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో కంకణధార నిర్వహించారు. అనంతరం గుడిలో ఉన్న బావి నుంచి గంగను తీసుకొచ్చారు. కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత వీరశైవుల విన్యాసాలతో స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పాతరాయచోటిలోని అగస్తేశ్వర స్వామి ఆలయం నుంచి మట్టి సేకరణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ ఉత్సవాలు తిలకించేందుకు కర్నాటక నుంచి వేలాదిగా తరలి వచ్చారు. అలాగే రాత్రి స్వామి వారి త్రిశూల మెరవణి, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు పర్యగ్నీకరణ చేశారు.

రైతు సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



జి.శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: రైతు సంక్షేమం గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేస్తున్న ద్రోహంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవా అంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు ఆ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో కన్నా పెట్టుబడి సాయం ఏటా రూ. 20 వేలు ఎందుకివ్వలేదని నిలదీశారు. ఇప్పటికే కేంద్రం పీఎం కిసాన్ సాయం రెండు విడతల్లో రైతులకు అందించిన కేంద్ర ప్రభుత్వం చివరి విడతగా ఈనెల 24న మరో రూ. 2 వేలను ఖాతాలకు జమ చేయనుందన్నారు. అయినా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఒక విడత కూడా నిధులు విడుదల చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నాడు వైఎస్ జగన్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకుంటే నేడు చంద్రబాబు ఉచిత పంటల బీమాను ఎత్తివేసి ఎకరాకు రూ. 615 చొప్పున ప్రీమియాన్ని అన్నదాతలపై భారం మోపారని ఆయన దుయ్యబట్టారు. వేరుశనగ పంట దెబ్బతిన్నా ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 1.45 లక్షల కోట్లు అప్పులు చేసినా రైతులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

టమాటా రైతులను ఆదుకోవాలి

టమాటా రైతుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోందన్నారు. కిలో టమాటా ధరలు రూ. 4, రూ. 5లకు పడిపోవడంతో కనీసం పంట కోసిన కూలీలకు, రవాణా చార్జీలు కూడా రాక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ చూపి తోటల వద్దే టమాటా కొనుగోలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో కిలో ఉలవలు రూ. 70 ఉండగా నేడు రూ.30 కూడా పలకకపోవడంతో రైతులు నష్టాలు మూటకట్టుకుంటున్నారని శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదేశాలు బేఖాతర్..ఆగని ఎమ్మెల్యే భూ కబ్జా

- వక్ఫ్‌బోర్డ్ పేరుతో 20 ఏళ్లుగా అనధికార వసూళ్లు
- టిప్పు సుల్తాన్ మైదానం వద్ద నిర్మాణాలను అడ్డుకొని బాధితుల నిరసన



టిప్పు సుల్తాన్ మైదానం వద్ద ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లిం మైనారిటీలు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

సాక్షి టాస్క్ ఫోర్స్: వక్ఫ్ బోర్డ్ పేరుతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమ ప్రైవేట్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతూ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ బాధితులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన బాషిత్ బాషా, షరీఫ్,వెంకటరమణ నాయుడు, శంకర్ రెడ్డి తదితరులు 30 మందికి పైగా ఆది వారం టిప్పు సుల్తాన్ మైదానం వద్దకు చేరుకున్నారు. అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎమ్మెల్యే అక్రమంగా కొనసాగిస్తున్న నిర్మాణాలను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు మీడియాకు విన్నవించారు. ఈనెల 19న సబ్ కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించేందుకు మదనపల్లెకు వచ్చిన ప్రభుత్వ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియాకు ఎమ్మెల్యే భూ కబ్జా, వక్ఫ్ బోర్డు పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్లు, టిప్పు సుల్తాన్ మైదానం వద్ద షాప్ రూ ములు నిర్మించి ఇస్తామని సేకరించిన డిపాజిట్లపై ఫిర్యాదు చేశామన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు టిప్పు సుల్తాన్ మైదానంలో నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసినా, ఎమ్మెల్యే వాటిని బేఖాతర్ చేస్తూ తమ ప్రైవేట్ భూముల్లో నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరి వద్ద లక్షల్లో డిపాజిట్లు సేకరిస్తున్నారన్నారు.ఖాజీ ఫ్యామిలీ మైసూర్ పాలకులైన టిప్పు సుల్తాన్ వద్ద నుంచి 20 ఇవాన్లకు భూములు కొన్నారన్నారు. 1862లో బ్రిటిష్ ఇనాం కమిషనర్ వద్ద నుంచి ఎన్ ఫ్రాంచైజెస్ ఇనాం యాక్ట్ ద్వారా హక్కులు పొందారన్నారు. అయితే ఆ భూము లను వక్ఫ్ బోర్డ్ నోటిపై చేసిందని , ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా షాపు రూములు నిర్మించి మసీదు పేరుతో, దొంగ రసీదులు ఇచ్చి బాడుగలు వసూలు చేసుకుంటున్నారన్నారు. బాధితుడు బాషిత్‌బాషాకు సర్వే నంబర్ 173 లో 97 సెంట్లు భూమికి సంబంధించి తమ వారసులు 1926లో పట్టా పొందారన్నారు. 2008లో షాజహాన్ బాషా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తన స్థలంపై కన్ను పడిందన్నారు. వక్ఫ్ బోర్డ్ పేరుతో రూ. 1.20 కోట్లు వసూలు చేసి షాపు రూములు నిర్మించారన్నారు. దీనిపై సీసీఎల్ఏ, సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్, వక్ఫ్‌బోర్డ్ ట్రిబ్యునల్లో తనకు అనుకూలంగా నిర్ణయాలు వెలువడ్డాయన్నారు. అదేవిధంగా సర్వేనంబర్ 171 లో 4.65 ఎకరాల భూమికి సంబంధించి సబ్ డివిజన్ పూర్తికాగా, అందులో ఒక ఎకరా స్థలాన్ని ఆక్రమించి అనధికారంగా నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారుల నోటీసు బేఖాతార్ చేస్తూ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. అధికారులు మున్సిపల్ యాక్ట్ ప్రకారం నిర్మాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 173 ను మున్సిపల్ లెక్కల్లో లేకుండా చేశారన్నారు.

ఇబ్బందులకు గురి చేస్తున్నారు

ఎమ్మెల్యే 20 ఏళ్లుగా వక్ఫ్ బోర్డ్ ,మసీదుల పేరుతో అక్రమంగా బాడుగలు వసూలు చేస్తూ దందాలకు పాల్పడ్డారన్నారు. రూ 20 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగా టీడీపీ కార్యకర్తలైన తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డ్ పేరుతో వసూలు చేసిన నిధులు ఎక్కడ ఉపయోగించారని, పేదలు ఒకరికైనా సాయం చేశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మసీదు పేరుతో ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అక్రమ దందాపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కలికిరి : మండలంలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. కలికిరి పంచాయతీ చెరువుముందరపల్లికి చెందిన శంకర(42) ఆదివారం జేఎన్టీయూ సమీపంలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ వస్తువులు ఎత్తుకుంటుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొంది. గమనించిన స్థానికులు శంకరను కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని..

వాల్మీకిపురం మండలం తాటిగుంటపల్లి గ్రామం జోగినాయునిపల్లికి చెందిన పెద్దరెడ్డెప్ప(79) వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం సాయంత్రం స్వగ్రామం నుంచి కలికిరికి ద్విచక్రవాహనంలో వస్తుండగా జేఎన్టీయూ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో పెద్ద రెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కలికిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నారాయణస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సీ మహమ్మద్ అలీ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

మదనపల్లె : చెరువులో పడి గాలివీడు మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బయ్య, యశోద దంపతుల కుమారుడు టంగుటూరి నాగరాజు(34) బెంగళూరులో పెయింటర్‌గా పని చేస్తూ జీవించేవాడు. అతనికి వివాహం కాలేదు. కొంత కాలం క్రితం స్వగ్రామానికి వచ్చిన నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి యశోద మందలిస్తూ ఉండేది. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి బయట తిరుగుతూ ఆదివారం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నక్కలకుంటలో శవమై తేలాడు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఓటరు కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మదనపల్లె చేరుకున్న కుటుంబ సభ్యులు పూర్తి వివరాలు పోలీసులకు అందించారు. మద్యం మత్తులో ప్రమాదశాత్తు నక్కలకుంటలో పడి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తూ.. తల్లి యశోద పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.


రామయ్యకు విల్లంబులు, బాణాలు సమర్పణ



ఒంటిమిట్ట రామాలయంలో ఉంచిన విల్లంబులు, బాణాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామికి బెంగళూరుకు చెందిన జోగారావు శర్మ ఆదివారం రెండు విల్లంబులు, రెండు బాణాలు సమర్పించారు. ఇవి ఇత్తడివని, వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఆలయ అధికారులు తెలియజేశారు.

శివమ్ కేశవమ్



పుష్పగిరిలోని శ్రీ చెన్నకేశవ, మల్లేశ్వరస్వామి దేవాలయం (ఇన్‌సెట్) శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ వైద్యనాథేశ్వరస్వామి మూలవిరాట్

- హరిహరులు కొలువైన క్షేత్రాలు
- మహాశివరాత్రికి భక్తులతో కళకళ
- శైవ, విష్ణు భక్తుల విభేదాలు రూపుమాపిన ఆలయాలు

కడప కల్చరల్ : మరో రెండు రోజుల్లో మహాశివరాత్రి రానుంది. ఈ సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడనున్నాయి. ఈ పండుగను వైష్ణవులు కూడా ఘనంగా నిర్వహించడం విశేషం. జిల్లాలో పలుచోట్ల ఒకే ప్రాంగణంలో శివకేశవుల ఆలయాలు ఉన్నాయి. వైష్ణవ భక్తులు కూడా శివయ్యను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.

తమ దేవుడే గొప్పంటూ శైవ, విష్ణు భక్తులు పరస్పరం దాడులకు దిగినట్లు పురాణ గాథల ద్వారా తెలుస్తోంది. నిజానికి దేవుడొక్కడేనని పెద్దలు పేర్కొంటారు. కారణాలేమైనా గానీ వందల ఏళ్లుగా శైవులు, వైష్ణవులు ఒకరిపట్ల ఒకరు ద్వేషం పెంచుకున్నట్లు చరిత్ర తెలుపుతోంది. ఫలితంగా ఒకరి ఆలయాలను ఒకరు ధ్వంసం చేసినట్లు కూడా ఆధారాలు ఉన్నాయి. విజ్ఞానం పెరిగాక అలాంటి విభేదాలు సమసిపోయాయి. శివకేశవుల అభేదానికి నిదర్శనంగా జిల్లాలో కొన్ని చోట్ల ఆ ఇద్దరు దేవతా మూర్తులను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసుకుని పూజిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి నేపథ్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కొన్ని దేవాలయాల గురించి సాక్షి పాఠకుల కోసం ప్రత్యేకం.

రామలింగేశ్వరాలయం

ప్రొద్దుటూరులోని ముక్తి రామలింగేశ్వర ఆలయంలో శివలింగాన్ని సాక్షాత్తు శ్రీరాముడే స్వయంగా ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. రావణుడిని చంపిన దోషాన్ని పోగొట్టుకునేందుకు శ్రీరాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాలని ఒకప్పటి దండకారణ్యమైన ఈ ప్రాంతానికి వచ్చారు. ముహూర్తం నిర్ణయించి కాశీ నుంచి శివలింగాన్ని తేవాలని హనుమంతుడిని పంపారు. హనుమ సమయానికి రాలేక పోవడంతో రాముడు స్వయంగా పెన్నానది ఒడ్డున ఇసుకతో లింగాన్ని చేసి స్వయంగా ప్రతిష్ఠించారు. ఆ తర్వాత హనుమంతుడు తెచ్చిన లింగాన్ని కొద్దిదూరంలో ప్రతిష్ఠించారు. రాముడే స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడం శివకేశవుల అభేదానికి తార్కాణంగా తెలుస్తోంది. జిల్లాలోని దాదాపు అన్ని డిపోల నుంచి ప్రొద్దుటూరుకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంది.

వరదరాజస్వామి ఆలయం

అన్నమయ్య జిల్లాలోని చిట్వేలిలో గల శ్రీ వరదరాజస్వామి ఆలయం 17వ శతాబ్దం నాటిదని తెలుస్తోంది. ఇందులో మూలమూర్తిని నల్లరాతితో మలిచారు. నాటి పాలకుడు మట్లి వేంకట రామరాజు కంచి క్షేత్రాన్ని దర్శించినపుడు శివకంచి, విష్ణుకంచి లాగానే మన ఊరిలో కూడా ఆలయాలను నిర్మించాలని ఆయన సతీమణి కోరింది. ఆ కోరికను మన్నించిన రాజు చిట్వేలిలో శివ, వైష్ణవ (శ్రీ వరదరాజస్వామి, శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి) ఆలయాలను ఒకే చోట నిర్మింపజేశారు. ఆ ప్రాంతంలో అప్పట్లో శివ, వైష్ణవ భక్తుల మధ్య వైరాలను తొలగించడానికి ఈ ఆలయాలు ఎంతో ఉపయోగ పడ్డాయట. రాజంపేట, రైల్వేకోడూరుల నుంచి ఈ క్షేత్రానికి ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల సౌకర్యం ఉంది. రాజంపేట నుంచి 37 కిలోమీటర్ల దూరంలో ఉంది.

పుష్పగిరి

చెన్నూరు సమీపంలోని పుష్పగిరికి హరిహర క్షేత్రంగా విశిష్టమైన పేరుంది. పెన్నానది పంచనది సంగమంగా మారిన ఈ ప్రాంతంలో చిన్న గుట్టపై శ్రీ చెన్నకేశవస్వామి, పక్కనే శ్రీ మల్లికార్జునస్వామి కొలువై ఉన్నారు. ఈ క్షేత్రం నిత్యం అటు శివభక్తులు, ఇటు విష్ణుభక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. గర్భాలయాలు వేర్వేరుగా ఉన్నా ముఖ మండపం, రాజగోపురం ఒకటే ఉండటం విశేషం. ఆ ఇద్దరూ ఒకటేనన్న భావన ఈ నిర్మాణాల ద్వారా అర్థమవుతోంది. కడప నగరం నుంచి ఈ క్షేత్రానికి పది కిలోమీటర్ల దూరం ఉంది. కడప నగరంతోపాటు మైదుకూరు, ఖాజీపేటల నుంచి కూడా బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల సౌకర్యం ఉంది.

దేవునికడప

కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయానికి సమీపంలో ఉత్తరాన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించిన రోజుల్లోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ రెండింటికీ మధ్యన ఒకే పుష్కరిణి ఉంది. వెంకటేశ్వరుడిని దర్శించుకునే భక్తులు ఆ వెంటనే సోమేశ్వరస్వామిని కూడా దర్శించుకోవడం ఆనవాయితీ. కడప నగర శివారులో ఉన్న ఈ ఆలయాలకు వ్యాన్లు, ఆటోల సౌకర్యం ఉంది.



దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం

శివ, వైష్ణవ ఆలయాలు

నందలూరులో శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. ఒకప్పుడు ఇది శివాలయమని, వైష్ణవ ప్రభావం పెరిగాక వైష్ణావాలయంగా మార్చారన్న కథనం ప్రచారంలో ఉంది. ఆలయ రాజగోపురానికి ఉత్తరాన శ్రీ ఉలగేశ్వరస్వామి ఆలయం ఉంది. అందులో నిలువు నామాల శివలింగం ఉండటం విశేషం. ఈ ఆలయం తమిళ పాలకుల నిర్మాణమని తెలుస్తోంది. తమిళంలో ఉలగం అంటే లోకమని, ఈశ్వరుడు అంటే శివుడని అర్థం. దీంతో ఈ స్వామిని ఉలగేశ్వరుడిగా వ్యవహరిస్తారు. పక్కపక్కనే శివ, వైష్ణవ ఆలయాలు ఉండటం ఈ క్షేత్రం ప్రత్యేకతగా చెప్పవచ్చు. రాజంపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి రాజంపేట, కడప డిపోల నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంది. ప్రైవేటు వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.



నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం

కలిసికట్టుగా పోరాడితే సమస్యలకు పరిష్కారం

రాయచోటి అర్బన్ : మాలలంతా ఐక్యతతో ముందుకు సాగితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటలో మాల మహానాడు జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలంతా కలసికట్టుగా పోరాడితే.. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం, ఎస్సీల రిజర్వేషన్ శాతం పెంచుకోవడం తదితరాలు సాధ్యపడుతాయన్నారు. మాలమహానాడు మొదటి నుంచి ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతోపాటు మాలలకు జరుగుతున్న పలురకాల అన్యాయాలు, అక్రమాలపై పోరాడటం జరిగిందన్నారు. సమావేశంలో మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చాకిబండ నాగరాజు, ఉపాధ్యక్షుడు మద్దెల జాన్‌సుధాకర్, రాయచోటి డివిజన్ అధ్యక్షుడు వినోద్‌రాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య

సమావేశంలో మాలమహానాడు సంఘానికి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా చింతపర్తి శివయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.జాన్ సుధాకర్, సహాయ కార్యదర్శిగా దుద్యాల రమణయ్య, కార్యవర్గ సభ్యులుగా జేమ్స్‌బాబు, గురుప్రసాద్, శ్రీకాంత్‌లతోపాటు రాయచోటి డివిజన్ అధ్యక్షుడిగా వినోద్ రాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

వీరబల్లి : మండల పరిధిలోని మాండవ్య నది నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు మాండవ్య నదిలోకి వెళ్లి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, దీంతో తమ గ్రామంలో రానున్న వేసవికాలంలో తాగు,సాగు నీటి సమస్య ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే తమ ప్రాంతం కరువు ప్రాంతమని, ఇసుక రవాణా ఇలాగే కొనసాగితే తమకు రానున్న రోజులలో నీటి కష్టాలు తప్పవని వాపోయారు. అధికారులు స్పందించి ఇసుక రవాణా అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామస్తులకు సర్దిచెప్పి అక్కడి నుంచి ఇసుక ట్రాక్టర్లను పంపివేశారు.



ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న వీరబల్లి గ్రామస్తులు

వీఆర్‌ఓపై సర్పంచ్ కుమారుడు దూషణ పర్వం

- చంపేస్తానంటూ బెదిరింపు
- ఉన్నతాధికారులకు తహసీల్దార్ ఫిర్యాదు

ఓబులవారిపల్లె : తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారంలో ఉన్నామన్న అహంకారంతో.. తాము ఏమి చేసినా అడిగే వారు లేరని బరితెగించి ప్రవర్తించడం జరుగుతోంది. ఇదే తరహాలో అధికార మదంతో చిన్నంపల్లి సర్పంచ్ సమ్మెట ధనమ్మ కుమారుడు చిన్న సుబ్బరాజు వీఆర్‌ఓ పీరయ్యపై తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడి దూషించిన సంఘటన చోటుచేసుకుంది. 'నువ్వు ఏమి పీకలేవు, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అని బెదిరిస్తూ.. 'గ్రామంలోకి వస్తే చంపేస్తాను' అంటూ వాయిస్ మెసేజ్‌లు పంపించాడు. ఇటీవలే బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓ పీరయ్య దీంతో కంగుతిన్నాడు. తన సర్వీసులో ఇలా తిట్టి చంపేస్తానంటూ ఎవరూ బెదిరించలేదని భయభ్రాంతులకు గురయ్యాడు. ఈ విషయాన్ని తహసీల్దార్ శ్రీధర్ రావుకు తెలుపగా ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీ, రాజంపేట సబ్ కలెక్టర్‌లకు వాయిస్ మెసేజ్‌లు పంపించి సర్పంచ్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్‌ఓ పీరయ్య తనకు ప్రాణహాని ఉందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీఆర్‌ఓ ఫిర్యాదుపై వాయిస్ మెసేజ్ పరిశీలించామని, చిన్న సుబ్బరాజును అదుపులోకి తీసుకున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

హత్యాయత్నం కేసుల్లో 10 మంది అరెస్ట్



క్రిష్ణాపురానికి చెందిన నిందితుల అరెస్టు చూపుతున్న తాలూకా ఎస్ఐ గాయిత్రి



అరవవాండ్లపల్లెకు చెందిన నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కళావెంకటరమణ

మదనపల్లె : హత్యాయత్నాలకు సంబంధించిన రెండు కేసుల్లో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఈ నెల 20న రాత్రి పుంగనూరు రోడ్డు కృష్ణాపురం వద్ద పెట్రోల్ బంకు సమీపంలో అరవవాండ్లపల్లెకు చెందిన గణేష్, క్రిష్ణాపురానికి చెందిన హరి మధ్య జరిగిన గొడవ.. ఇరు గ్రామాలకు సంబంధించిన వ్యక్తుల మధ్య దాడికి దారి తీసింది. ఇరు గ్రామాల ప్రజలు మారణాయుధాలతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి భయానక వాతావరణం సృష్టించారు. ఈ ఘటనలో అరవవాండ్లపల్లెకు చెందిన గణేష్ ఫిర్యాదు మేరకు కృష్ణాపురానికి చెందిన 11 మందిపై, హరి ఫిర్యాదు మేరకు అరవవాండ్లకు చెందిన 13 మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా దాడులకు పాల్పడిన మరి కొందరిని గుర్తిస్తున్నారు. ఈ కేసులకు సంబంధించి గణేష్ ఫిర్యాదు చేసిన కేసులో నిందితులైన క్రిష్ణాపురానికి చెందిన కె.హరి(34), కె.సురేష్(37), పి.సాయికళ్యాణ్ అలియాస్ కళ్యాణ్ (28), నక్కా రెడ్డిప్రసాద్(21), నిమ్మనపల్లె నవీన్(24), ఓటగడ్డ పవన్‌కుమార్ (24)లను అరెస్టు చేశారు. అదే విధంగా హరి ఫిర్యాదు చేసిన కేసులో నిందితులైన అరవవాండ్లపల్లెకు చెందిన పూల గణేష్ (24), పూల నారాయణస్వామి (44), పూల సందీప్(21), పూల శివరాజు అలియాస్ శివరాజ్(30)లను అరెస్టు చేశారు. రిమాండు నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. అవసర గొడవలకు పాల్పడి గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తామంటూ చేసిన ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆప్కాస్‌లోని నాన్‌టీచింగ్ స్టాఫ్ ఆప్కాస్ రద్దును నిరసిస్తూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో ఇప్పటి వరకు పని చేస్తున్న ఉద్యోగులందరికీ తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ప్రతి నెలా ఒక శాతం కమీషన్‌తో వేతనాల సర్వీసును అందించే ఆప్కాస్‌ను రద్దు చేసి నాలుగుశాతం కమీషన్ తీసుకునే రాబందుల లాంటి కాంట్రాక్టర్ల చేతికి 1 లక్ష 20 వేల మంది భవిష్యత్తును కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధ పడిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన పరిపాలనను అందిస్తామన్న నినాదంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భద్రత లేని ఉద్యోగాల కల్పనకు మొగ్గుచూపడం సరైంది కాదన్నారు. ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతున్న పాలకులు మరోవైపు కాంట్రాక్టర్లకు రూ.70 కోట్లు చెల్లించేందుకు ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నారంటూ ఆరోపించారు. వెంటనే పాలకులు ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షహనాజ్, వసంత, హాజిరా, కన్నమ్మ, బుజ్జమ్మ, అరుణ, మంజూష, లక్ష్మీదేవి, శిరీష, మౌనిక, రామ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన

సారె తీసుకెళ్తుండగా..

- టాటా ఏస్ బోల్తా
- 15 మందికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కృష్ణయ్య



చికిత్స కోసం క్షతగాత్రురాలిని తీసుకెళ్తున్న బంధువులు

రాయచోటి టౌన్ : పుట్టినింటి నుంచి కొత్త పెళ్లి కూతురు అత్తారింటికి నెల సాంగెం తీసుకెళ్తుండగా.. టాటా ఏస్ బోల్తా పడి 15 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషయంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. పెళ్లికుమార్తె తండ్రి పుల్లగూర కృష్ణయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండల పరిధిలోని మాధవరానికి చెందిన పుల్లగూర కృష్ణయ్య కుమార్తెను టి.సుండుపల్లె మండలం రాచంవాండ్లపల్లెకు చెందిన నాగరాజుకు ఇచ్చి రెండు నెలల క్రితం వివాహం చేశాడు. వీరి వివాహంలో భాగంగా నెల సాంగెం(ఉపాగి సారె) పంపుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాంగెంకు కావాల్సిన వంటలను వండించుకొని.. టాటా ఏస్ వాహనం ద్వారా సుండుపల్లె చారంవాండ్లపల్లెకు తీసుకెళ్తున్నారు. మార్గంమధ్యలోని రాయచోటి – సుండుపల్లె రోడ్డులో మోడల్ స్కూల్ సమీపాన డౌన్‌లో బోల్తా పడింది. ఆ సమయంలో పెళ్లి కుమారుడే వాహనం నడుపుతున్నట్లు ఆటోలోని వ్యక్తులు తెలుపుతున్నారు. డౌన్ ఎక్కువగా ఉండటంతో ఆటో వేగంతో వెళ్లడంతో.. అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న 15 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొత్త పెళ్లి కుమార్తెతోపాటు కొత్త పెళ్లి కుమారుడికి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెళ్లి కుమార్తె తండ్రికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా స్థానిక వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు పంపించారు. మిగిలిన వారికి రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం అందిస్తున్నారు. ప్రమాద సంఘటనపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. గాయపడిన వారిలో రామలక్ష్మమ్మ, పురుం కృష్ణయ్య, నరేష్, రంజిత, లక్ష్మీదేవి, అనూష, శైలజ, రమేష్, జ్యోష్ని, జ్ఞాపిక, రెడ్డి రాణి, అఖిల, కృష్ణయ్య, వెంకటేష్, నరేష్‌లు ఉన్నారు. వీరిలో పెళ్లికుమార్తెతోపాటు పెళ్లికుమార్తె తండ్రి పుల్లగూర కృష్ణయ్య ఉన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులను దగా చేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి

సుండుపల్లె : రాజకీయ లబ్ధి కోసం అన్ని వర్గాలను మోసం చేయడమే కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కిషోర్‌రెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు అబ్దుల్లాఖాన్ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడు వారాలుగా గ్రూప్-2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్లు నటిస్తూ, న్యాయం చేస్తామని కబుర్లు చెబుతూ.. చివర్లో తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేయడం నిరుద్యోగుల పట్ల ఉన్న నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ కూడా నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా గ్రూప్ -2 పరీక్షల కోసం చర్యలు తీసుకుంటామని ట్వీట్ చేశారని, ఇలా ప్రభుత్వంలోని పెద్దలందరూ గ్రూప్-2 అభ్యర్థులను నిట్టనిలువునా ముంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-2 పరీక్ష అభ్యర్థుల విషయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఒక మాట.. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ మరో మాటతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో గందరగోళ పరిస్థితుల్లో నెలకొని ఉందన్నారు. కచ్చితంగా గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేస్తామంటూ ముఖ్యమంత్రి పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆడియోను రాష్ట్ర ప్రజలంతా విన్నారని, కానీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా గ్రూప్-2 పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులను గందరగోళానికి గురిచేయడం అమానుషమైన చర్య అని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల్లో అక్రమంగా ప్రవేశించిన వారిపై ఫిర్యాదు

మదనపల్లె : పట్టణ పరిధి కదిరి రోడ్డులో ఉన్న టిప్పు సుల్తాన్ మైదానంలోని బోర్డ్ భూములలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం మైనారిటీలు, ముస్లిం మత పెద్దలు డీఎస్పీ కొండయ్య నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ వక్ఫ్ భూములలో అక్రమంగా ప్రవేశించి.. ముస్లింలు, జమాత్ పెద్దలు, ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు వ్యతిరేకంగా మాట్లాడిన శంకర్‌రెడ్డి, ఆడిటర్ శ్రీనాథ్, అతని భార్య రమ్య, బక్షు, షరీఫ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్ భూములకు సంబంధించిన సర్వ హక్కులు జామియా మసీదుకు చెందుతాయని ఓ.ఎస్.నంబర్ 33/94లో 2005 లోనే మదనపల్లి సీనియర్ సివిల్ కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ, సమాజంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జామియా మసీదు కేర్ టేకర్ కమిటీ అధ్యక్షుడు సర్దార్, న్యాయవాది నాయబ్ సికిందర్ అలీఖాన్, అక్బర్ బాషా, ఖాజా హుస్సేన్, అహ్మద్ బాషా, షంషీర్, ఇంతియాజ్, జలాల్ సాహెబ్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం మైనారిటీలు, మత పెద్దలు